క్లుప్తంగా

ముగిసిన ఉద్భవ్ వేడుకలు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఉద్భవ్ 2025 వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు ఈ వేడుకలు నిర్వహించామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఉద్భవ్‌లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ వేడుకలకు పలు కళాశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.

ఏఐకేఎంఎస్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: భూ సమస్యలపై ఈ నెల 28న విజయవాడలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. స్థానిక మావోభవన్‌లో శనివారం జరిగిన సంఘం సమావేశంలో ఆ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. టాన్యా మాట్లాడుతూ సమాజ మనుగడకు, ప్రజల మౌలిక హక్కుల కోసం ఉపయోగపడే భూమి కొందరికే పరిమితమైందని విమర్శించారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



వీరభద్రస్వామి సంబరంలో పాల్గొన్న భక్తులు

కడియం: దుళ్ల గ్రామంలో వీరభద్రస్వామి సంబరాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా మాఘమాసంలో శనివారం స్వామివారి సంబరం చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో స్వామికి ప్రతిరూపమైన విభూది పండ్లను తలపై పెట్టుకుని పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరనృత్యం, గరగ నృత్యాలు, మంగళ వాయిద్యాలతో గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు.

24న ఆర్ట్స్ కళాశాలలో ఓపెన్ ల్యాబ్

కంబాలచెరువు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న ఆర్ట్స్ కళాశాలలో ఓపెన్ ల్యాబ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ తమ కాలేజీ విద్యార్థులతో పాటు చుట్టుపక్కల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కూడా వచ్చి ప్రయోగశాలను వీక్షించవచ్చన్నారు.

వెండి కడియాల సమర్పణ



వెండి కడియాలను అందజేస్తున్న లక్ష్మణ్ దంపతులు

కడియం: కడియపులంక గ్రామదేవత పల్లాలమ్మ అమ్మవారికి నాగిరెడ్డి లక్ష్మణ్, లక్ష్మి దంపతులు శనివారం పావుకేజీ వెండితో తయారు చేయించిన కడియాలను అందజేశారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి వాటిని అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వశాంతి దినోత్సవ ర్యాలీ



విశ్వశాంతి దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

కంబాలచెరువు: విశ్వశాంతి దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఆదిత్య బిజినెస్ స్కూల్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ప్రారంభించారు. ఆ స్కూల్ నుంచి ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్, షెల్టన్ హోటల్ మీదుగా ర్యాలీ కొనసాగింది. కళాశాల ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ జి.నాగేశ్వరరావు, అధ్యాపకుడు పి విజయ్ దేవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకూ.. ఓ నంబర్



- విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేస్తున్న కేంద్రం
- నమోదు అయితేనే ప్రభుత్వ పథకాలు
- చురుగ్గా సాగుతున్న ప్రక్రియ

కడియం: ప్రస్తుతం ఉన్న ఆధార్ కార్డుల తరహాలోనే భూ ఆధార్ కార్డులను ప్రభుత్వ యంత్రాంగం జారీ చేస్తోంది. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ప్రత్యేక యాప్ ద్వారా చేపడుతున్న ఈ నమోదు ప్రక్రయ ద్వారా 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రతి రైతుకు జారీ చేస్తారు. సాగు చేసే ప్రతి రైతు ఈ గుర్తింపు నంబర్‌ను కలిగి ఉండడం ద్వారా భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను పొందడానికి అర్హుడు అవుతాడు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేశారు. రాజవోలులో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు స్వయంగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను పరిశీలించి, పలు సూచనలు చేసారు.

నమోదు విధానం ఇలా..

భూమి కలిగిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, 1బీ అండంగళ్, ఆధార్ కార్డు కాపీలతో పాటు ఆధార్ కార్డుకు లింక్ అయి ఉన్న ఫోన్ నంబర్‌ను వారి గ్రామంలోని సచివాలయానికి అనుబంధంగా ఉన్న రైతు సేవా కేంద్రానికి తీసుకు రావాలి. అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) సంబంధిత పోర్టల్‌లో ఫార్మర్ నమోదు ప్రక్రియను చేపడతారు. ఈ క్రమంలో ఫోన్ నంబర్‌కు వచ్చే మూడు ఓటీపీలు చెప్పాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతం అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దీంతో నమోదు ప్రక్రియ పూర్తయినట్లు భావించాలి. ఇలా నమోదు చేసుకుంటునే ప్రభుత్వ పథకాలు పక్కాగా వర్తిస్తాయి. విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రైతు సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందించేందుకు వీలవుతుందని ప్రభుత్వాధికారులు చెబుతున్నారు.



రాజవోలులో ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నమోదు ప్రక్రియ పూర్తయిన తరువాత రైతులకు జారీ చేసిన విశిష్ట గుర్తింపు సంఖ్యను భద్రపరచుకోవాలి. ఒక వేళ గుర్తింపు సంఖ్యను మర్చిపోయినా రైతు సేవా కేంద్రానికి వెళ్లి, తమ భూమి వివరాలు ఇచ్చి సదరు సంఖ్యను తెలుసుకోవచ్చు.

ఎంతో ప్రయోజనం

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను కడియం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ విస్తృతంగా గ్రామ వ్యవసాయ సహాయకులు చేపడుతున్నారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఆధార్ నంబర్ ద్వారా మన వివరాలు ఏ విధంగా తెలుస్తాయో, అలాగే ఈ 14 అంకెల భూ ఆధార్ ద్వారా రైతులు, వారు సాగు చేస్తున్న పంటల వివరాలను తెలుసుకోవచ్చు. రైతులకు అందుతున్న పథకాలపై సమాచారం ఉంటుంది. ఏ పథకానికి రైతు అర్హుడు అన్నది కూడా తెలుస్తుంది. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

– కె.ద్వారకాదేవి, వ్యవసాయాధికారి, కడియం

పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో సమాజాభివృద్ధి



విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీటీఆర్ఐ: అంబేడ్కర్ ఆశయమైన పే బ్యాక్ టు సొసైటీ నినాదంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ దియ్యన రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలోని హోలీ ట్రినిటీ చర్చిలో అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షుడిగా జార్జి ఆంటోనీ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఫౌండర్ రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ అసోసియేషన్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు చేసి విరమణ చేసిన 70 మంది సభ్యులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిని అంబేడ్కర్ సేవా పురస్కారాలతో సన్మానించారు.

జంక్ ఫుడ్‌తో అనేక అనర్థాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జంక్ ఫుడ్ కారణంగా మానవ శరీరానికి అనేక అనర్థాలు కలుగుతాయని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టుముక్కల అనంతరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని గణేష్ చౌక్‌లో ఉన్న రైతు బజార్‌లో శనివారం కన్స్యూమర్స్ వాయిస్ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ధర్నాలకోట వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు గొట్టిముక్కల అనంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్న ప్రతి వస్తువుకు రశీదు తీసుకోవాలన్నారు. అనంతరం రైతుబజార్‌లోని దుకాణాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఉద్యోగి విజయ్, రైతులు శ్రీను, ప్రసాద్, వినియోగదారులు పాల్గొన్నారు.

ఘనంగా 'అంతరంగం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సామాజిక స్పృహ కలిగిన శ్రీపాద శ్రీనివాస్ తన పుస్తక రచనను కొనసాగించాలని పలువురు వక్తలు అన్నారు. హరిచందన పబ్లికేషన్స్ పక్షాన గజరావు వెంకటేశ్వరరావు సారథ్యంలో ఆయన రాసిన అంతరంగం పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ప్రకాశం నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాలుపైన గల బుక్ బ్యాంకులో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో శ్రీపాద పుస్తకావిష్కరణ ఇంతమంది ఆత్మీయుల నడుమ జరగడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీనివాస్ తన మంచితనం కారణంగానే ఇంతమంది ఆదరణ పొందగలిగాడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ, నెల్లూరు జిల్లా ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లో శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 25వ తేదీ నుంచి సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసున్నవారు అర్హులన్నారు. పదో తరగతి పాసై, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు అర్హులన్నారు. వివరాలకు 0883-242024, 2428807, 97013 59954, 90143 28803 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కంబాలచెరువు: లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలోని 154 మంది పదో తరగతి విద్యార్థులకు టీం స్పిరిట్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ శనివారం పరీక్ష అట్టలు, పెన్నులను పంపిణీ చేసింది. ఆ సంస్థ అధ్యక్షుడు దాచేపల్లి పృథ్వీరాజ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అవసరమైన సహాయం అందజేస్తామని, దాని కోసం 95736 91699, 63038 29889 నంబర్లను సంప్రదించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, సెక్రటరీ పోలిపల్లి కార్తీక్, సభ్యులు పాల్గొన్నారు.

బాల నేరస్తులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి

కంబాలచెరువు: బాల నేరస్తులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. శనివారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యాలయంలో లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్లు, స్త్రీ, శిశు సంక్షేమ, పోలీసుశాఖలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం సునీత మాట్లాడుతూ సమాజంలో ఆదరణ కొరవడిన, వివక్ష గురవుతున్న చిన్నారులు నేర ప్రవృత్తిని అలవర్చుకుంటున్నారన్నారు. వారిని గుర్తించి, సరైన మార్గంలో నడిపించాలన్నారు. చిన్నారులు నేరాలకు పాల్పడితే వారిని అబ్జర్వేషన్ హోమ్‌లో పెట్టి, మళ్లీ నేరాలకు పాల్పడకుండా చూడాలన్నారు. రాజమహేంద్రవరం ఏఎస్పీ ఎన్‌బీఎం మురళీ మాట్లాడుతూ జ్యువెనల్ చిన్నారులను అరెస్టు చేసిన సమయంలో వారి రక్షణ విషయంలో మరింత జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎన్.శ్రీలక్ష్మి, కోనసీమ అడిషనల్ ఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

నాగరాజా పాఠశాల తనిఖీ

కంబాలచెరువు: నాగరాజా ప్రాథమిక పాఠశాలను డైట్ లెక్చరర్ కె.గంగాధరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఒకటి నుంచి నాలుగు తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గ్రేడింగ్, తరగతి లైబ్రరీ, పాఠశాల నిర్వహణపై హెచ్‌ఎం మంగారాణి తీసుకుంటున్న శ్రద్ధను అభినందించారు.

ఊషా పోటీల్లో విద్యార్థినుల సత్తా

ప్రకాశం నగర్: రాష్ట్ర స్థాయి వుమెన్ ఊషూ లీగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు సత్తా చాటి, పలు పతకాలు సాధించారని కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి తెలిపారు. జూనియర్స్ 60 కేజీల విభాగంలో కె.రేబా బంగారు, 52 కేజీల విభాగంలో కె. సత్యవేణి వెండి, 70 కేజీల విభాగంలో ఎం.ధనలక్ష్మి కాంస్య పతకాలను సాధించారన్నారు. విజేతలను కోచ్ ఎం.భవానీ శంకర్, పీడీ వై.సుధారాణి తదితరులు అభినందించారన్నారు.

నన్నయ అభివృద్ధికి సహకారం

సీటీఆర్ఐ: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీకు కలెక్టర్ పి.ప్రశాంతి హామీ ఇచ్చారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను నన్నయ వీసీ కలిసి, పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం నూతన కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణ

సీటీఆర్ఐ: రాష్ట్రంలో పేదలు ఆక్రమించుకుని, గృహ నిర్మాణాలు చేపట్టిన స్థలాలను క్రమబద్ధీకరణ చేయడానికి ప్రభుత్వం 30వ నంబర్ జీఓ జారీ చేసిందని రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణ నాయక్ అన్నారు. క్రమబద్ధీకరించుకోవాలనుకునే వారు దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందజేయాలన్నారు. ఆర్‌సీసీ రూఫ్‌తో గానీ, ఆజ్ బెస్టాస్ రేకులతో కూడిన ఇటుకల ఇళ్లు ఉండాలని, 2019 నుంచి విద్యుత్ బిల్లులు, ఇంటి పన్ను, వాటర్ ట్యాక్స్ కలిగి ఉండాలన్నారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా, 151-300 చదరపు గజాల వరకు 15 శాతం బేసిక్ వాల్యూ, 50 శాతం రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మిగిలిన విషయాలకు ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. శనివారం కాతేరు గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ ఆధ్వర్యంలో ఆయన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాఠశాలలు, సచివాలయాల ఉద్యోగులను కలిసి ఓట్లను అభ్యర్థించారు.

నేడు సహస్ర గళ పారాయణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): టి.నగర్‌లోని హిందూ సమాజంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సహస్ర గళ పారాయణ నిర్వహించనున్నారు. స్థానిక కన్వీనర్ మిర్తిపాటి వెంకటరామయ్య ఈ విషయాన్ని శనివారం ప్రకటనలో తెలిపారు. కల్యకొలను చిత్తరంజాన్ దాస్ స్మారక సేవాసంస్థకు అనుబంధసంస్థ అయిన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో లోకకళ్యాణం కోసం ఈ కార్యక్రమం జరుపుతున్నామని ఆయన తెలిపారు.

డీఎఫ్ఆర్‌సీను సందర్శించిన ఒడిశా రైతులు



డీఎఫ్ఆర్‌సీలో ఒడిశా రైతులు, స్థానిక అధికారులు

కడియం: వేమగిరిలోని డివిజనల్ ఫ్లోరీ కల్చర్ రీసెర్చ్ సెంటర్ (డీఎఫ్ఆర్‌సీ)ను ఉద్యాన శాఖాధికారి ప్రియాంక ఆధ్వర్యంలో శనివారం ఒడిశా రైతుల బృందం సందర్శించింది. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విచ్చేసిన వారికి వేమగిరి డీఎఫ్ఆర్‌సీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డీవీఎస్ రాజు పూలసాగు ప్రాధాన్యత, వాటిని ఆశించే చీడపీడలు, నివారణా చర్యలు, ఇతర యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆధునిక యాజమాన్య పద్ధతుల ద్వారా పూలసాగులో లాభాలు ఆర్జించవచ్చన్నారు. అలాగే కడియపులంకలోని పుల్లా పెద సత్యనారాయణకు చెందిన సత్యదేవ నర్సరీని ఒడిశా రైతులు సందర్శించారు. వారికి పెద సత్యనారాయణ నర్సరీల్లో మొక్కల పెంపకం విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈ బృందం రాజానగరంలోని కేవీకేను సందర్శించింది. అక్కడి సీనియర్ శాస్త్రవేత్త రఘునందన్ కూరగాయల సాగు పద్ధతులను వివరించారు. రైతుల బృందం వెంట కడియం మండల ఉద్యాన అధికారి డి.సుధీర్ కుమార్, ఉద్యాన సహాయకులు ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: విధి నిర్వహణలో ఒత్తిడికి గురవుతున్న గ్రామ సచివాలయ ఉద్యోగులకు జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాల మేరకు హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నిజామ్స్ ఫిజియోథెరపీ ఇనిస్టిట్యూట్ ట్రైనర్లు రమేష్, సంతోష్ కుమార్ పలు ఆరోగ్య విషయాలను వివరించారు. బ్యాక్ పెయిన్, నెక్ పెయిన్, నీ పెయిన్ విషయాలలో ఆందోళన చెంది, పెయిన్ కిల్లర్ మందులను అతిగా వాడొద్దన్నారు. పలు వ్యాయామాల ద్వారా నొప్పులను తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఆకెళ్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనర్ రమేష్

స్కౌట్స్ శిక్షణతో దేశభక్తి, సేవాభావం



స్కౌట్స్ పితామహుడు రాబర్ట్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

కంబాలచెరువు: స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవడతాయని ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్కౌట్ దినోత్సవం నిర్వహించారు. స్కౌట్ పితామహుడు సర్ రాబర్ట్ బెడన్ పవల్ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాల బాలికలలో దేశభక్తి, క్రమశిక్షణను పెంపొందించి, వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడానికి ప్రారంభించినదే బాలభట ఉద్యమం (స్కౌట్స్ అండ్ గైడ్స్) అన్నారు. ఈ ఉద్యమంలో బాలుర బృందాలను స్కౌట్స్, బాలికల బృందాలను గైడ్స్ అంటారన్నారు. కార్యక్రమంలో స్కౌట్ ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణ మోహన్, చంద్రకళ, రాంబాబు, అప్పారావు, పూర్ణిమ, రమణశ్రీ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం హుకుంపేటలోని వల్లీ నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన నంది సాయికృష్ణ మనోజ్ (35) రాజమహేంద్రవరంలోని ఎల్అండ్‌టీ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఏరియా సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో కలిసి హుకుంపేట వల్లీనగర్‌లోని ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. వారికి వివాహమై ఏడేళ్లు అయినప్పటికీ సంతానం లేదు. ఇటీవల అతడి భార్యకు మూడో నెలలో గర్భం పోయింది. దీంతో ఆమె వారం రోజుల క్రితం తన తల్లిదండ్రుల వద్దకు విజయవాడ వెళ్లింది. అప్పటి నుంచి సాయి కృష్ణ మనోజ్ ఒక్కడే ఇంటిలో ఉంటున్నాడు. అయితే రెండు రోజుల నుంచి మనోజ్ సెల్‌ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అతడి స్నేహితులు శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వెళ్లి చూడగా చున్నీతో ఉరి వేసుకుని ఉన్నాడు. మనోజ్ మావయ్య యిమ్మని సుధీర్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



విద్యార్థులతో డీఈవో వాసుదేవరావు, ఉపాధ్యాయులు

కడియం: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన స్కౌట్ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసిన స్కౌట్, గైడ్ 40 మంది విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా జాతీయ జెండాను వాసుదేవరావు, స్కౌట్ జెండాను గొల్లపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. గైడ్ టీచర్ బి.గిరిజ ప్రార్థన, జెండా గీతాలు, ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా స్కౌట్ కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడారు. ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు, గైడ్ సహాయకులు వై.వీర రాఘవకుమారి, పీడీలు డేవిడ్, వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులో శనివారం తడి, పొడి చెత్త సేకరణపై జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అవగాహన కల్పించారు. డీఎల్‌పీవో నాగలత, ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఇలా వేర్వేరుగా చెత్త సేకరణ వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కాతేరు, తొర్రేడు, వెంకటనగరం, శాటిలైట్‌సిటీ, పిడింగొయ్యి, ధవళేశ్వరం, హుకుంపేట, బొమ్మూరు, రాజవోలులో ఆయా గ్రామాల కార్యదర్శుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కడియం: తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచాలని ఈవోపీఆర్‌డీ రాంప్రసాద్ అన్నారు. మండలంలోని జేగురుపాడులో శనివారం ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి, పొడిగా చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది, సచివాయల ఉద్యోగులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలును సందర్శించిన నన్నయ వీసీ

కంబాలచెరువు: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.ప్రసన్నశ్రీ శనివారం సందర్శించారు. జైలులోని నర్సరీ, ఆసుపత్రి, ఖైదీల బ్యారక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. విద్య, మానసిక ఆరోగ్య కార్యక్రమాల ద్వారా ఖైదీలను సంస్కరించడం, శక్తివంతం చేయడానికి యూనివర్సిటీలోని ప్రొఫెసర్లు, సైకాలజీ విద్యార్థులను ఇక్కడకు పంపి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఖైదీలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇప్పించేందుకు నన్నయ యూనివర్సిటీ ద్వారా నిధులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, ఉప పర్యవేక్షణాధికారి బి.రత్నరాజు, వైద్యాధికారులు ఉన్నారు.